ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబరు 2025

మాట్లాడుతున్న సాహితీ స్రవంతి కన్వీనర్ శ్రీనివాసు

- స్త్రీ శక్తి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ
- రోజుకు సగటున లక్ష మందికి పైగా మహిళల ప్రయాణం

ప్రయాణ పాట్లు

- బస్సుల సంఖ్య పెంచని ప్రభుత్వం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

స్త్రీ శక్తి పథకం అమలైన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో, విపరీతమైన రద్దీ నెలకొంటోంది. పథకం అమలు చేశాం, మీ పాట్లు ఏవో మీరు పడండి అన్న రీతిలో ప్రభుత్వ తీరు ఉండడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. కనీసం మహిళలు కూడా బస్సులు ఎక్కలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు దసరా సీజన్ కావడంతో విపరీతమైన రద్దీతో బస్సులు నడుస్తున్నాయి. బస్సులు రద్దీగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న మహిళలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేసింది. అప్పట్నుంచి పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తోంది. జిల్లాలో శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, టెక్కలి, పలాస డిపో పరిధిలో మొత్తం 310 బస్సులు ఉన్నాయి. అందులో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 250 బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతోంది. పథకం అమలైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 36.20 లక్షల మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. రోజుకు సగటున లక్ష నుంచి 1.05 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలైన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. గతంలో ఆక్యుపెన్సీ రేటు 61 శాతం ఉండగా, ఇప్పుడు 87 శాతానికి పెరిగింది. పథకం అమలుకు ముందు రోజుకు సగటున 30 వేల మంది ప్రయాణించేవారు. ఇప్పుడు ప్రయాణికుల సంఖ్య మూడు రెట్లకు పైగా పెరిగినా 250 బస్సులతోనే ప్రభుత్వం నెట్టుకొస్తోంది. దీంతో ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణమంటే ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.

బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మహిళలే బస్సులు ఎక్కలేని పరిస్థితి

ఉచిత బస్సు అవకాశం కల్పిస్తున్నా వారే అందులో ఎక్కలేని పరిస్థితి నెలకొంది. స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు, తర్వాత కూడా అవే సంఖ్యలో పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తుండటంతో విపరీతమైన రద్దీ నెలకొంది. సాధారణ రోజుల్లో ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి ఏడున్నర గంటల వరకు విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువ ప్రయాణిస్తుంటారు. ఈ వేళల్లో బస్సుల్లో రద్దీ అధికంగా ఉంటోంది. ఆదివారం, ఇతర పండగలు, సెలవు దినాల్లో అయితే పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. బస్సులో ఎంతమంది ఎక్కుతున్నారో, కాంప్లెక్స్‌ల్లో అంతమంది నిరీక్షిస్తున్నారు బస్సుల రద్దీతో మహిళలు, చిన్నారులు నిల్చొనే ప్రయాణిస్తున్నారు. తాము దిగాల్సిన స్టేజీ వచ్చినా దిగలేక నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది మహిళలు ప్రయాణించలేక డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి బస్సులను ఆశ్రయిస్తున్నారు.

ప్రభుత్వ తీరుతో వ్యతిరేకత

ఉచిత బస్సు పథకంపై సాధారణ ప్రయాణికుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో సాధారణ ప్రయాణికులూ ఇబ్బందులు పడుతున్నారు. సీట్ల కోసం బస్సుల్లోనే కొట్టుకుంటున్న ఘటనలూ నమోదవుతున్నాయి. బస్సుల్లో గొడవలు పడటం నిత్యకృత్యంగా మారింది. టికెట్ తీసి ప్రయాణిస్తున్న వారు సీట్లు లేక ప్రభుత్వానికి శాపనార్థాలు పెడుతున్నారు. ప్రయాణాలు పెరిగినా, ప్రభుత్వం అదనంగా బస్సులు నడపకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్న చర్చ నడుస్తోంది.

దసరా నేపథ్యంలో మరింత రద్దీ

దసరా పండగ నేపథ్యంలో ఆర్‌టిసి బస్సుల్లో విపరీతమైన రద్దీ నెలకొంది. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణాలు ఒకవైపు పెరిగితే, మరోవైపు దసరా పండగ కావడంతో అందరూ సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, పాలకొండ, బత్తిలి రూట్లలో అధిక రద్దీ నెలకొంది. దసరా నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడపుతున్నామని అధికారులు చెప్తున్నా, ప్రస్తుతం తిప్పుతున్న బస్సులనే పండుగ ప్రత్యేక బస్సుల లెక్కలుగా చెప్తున్నారు. దీంతో బస్సుల్లో ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు.

ప్రభుత్వ విధానాలతో విద్యకు పేదలు దూరం

సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ విధానాలతో పేదలు విద్యకు దూరమవుతున్నారని సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ నాయకులు కీ.శే కొత్తకోట రామలక్ష్మి ఏడో వర్ధంతి సందర్భంగా 'విద్యారంగ సంస్కరణలు - ప్రభావాలు' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ప్రాథమిక విద్యలో డ్రాపౌట్ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పెరుగుతున్నాయని చెప్పారు. దేశంలో 1300 విశ్వవిద్యాలయాలు ఉంటే, 50 శాతం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. నూతన విద్యా విధానం 2020 రాజకీయ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్నారని విమర్శించారు. మాతృభాషలో విద్యా బోధన విస్మరిస్తే, విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. తొమ్మిది రకాల పాఠశాలలు నిర్వహించినా, ప్రమాణాలు పాటించకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్య నిర్వీర్యమవుతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యమైతే పేదలకు విద్య దూరం అవుతుందన్నారు. ఇప్పటికే పేద విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్య అందని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పేదలకు విద్య దూరమవుతుందని చెప్పారు. విద్యలో రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలు ముఖ్యమని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా విద్యలో మార్పులు తప్పనిసరిగా చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వాలు మారినా విద్యా విధానంలో మార్పు ఉండకూడదని చెప్పారు. నేటి ఉపాధ్యాయులకు, సమస్యలపై పోరాటాలకు రామలక్ష్మి ఆదర్శమని తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం మెరుగైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుందని, నైతిక విలువలు తగ్గుతాయని చెప్పారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి ప్రైవేట్‌కు ధీటుగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా వక్తలు యుటిఎఫ్ నాయకులు రామలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వాగ్దేవి, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు యువతలో చైతన్యం పెంచి ప్రాణ నష్టం తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడం ద్వారా గాయపడిన వారిని రక్షించవచ్చని ఆయన స్పష్టం చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్స అవగాహన అవసరమని అన్నారు. ఇది ప్రాణాలను కాపాడే ముఖ్య సాధనమని తెలిపారు.

వైస్ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్ మాట్లాడుతూ ప్రథమ చికిత్స జ్ఞానం తోటి వారిని ఆపత్కర పరిస్థితుల్లో రక్షించే శక్తినిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఫస్ట్‌ఎయిడ్, కృత్రిమ శ్వాస, గుండెపోటు, ఎముకలు విరిగినప్పుడు చేయాల్సిన చర్యలు, రక్తస్రావం నియంత్రణ, కాలిన గాయాలు, మధుమేహం, రక్తపోటు, పాముకాటు, ఇతర జంతువుల కాట్లు వంటి అంశాలపై కె.సత్యనారాయణ, జి.రమణ, పి.చైతన్యకుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంసి మెంబరు బి.చిన్నయిరావు, ఎ.నర్సింగరావు, గుణాకరరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

అర్హులైన పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని కొత్తపేటకు చెందిన 26 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. నివాస యోగ్యం కాని, శ్మశానాలు, డంపింగ్ యార్డుల పక్కన, వర్షం వస్తే మునిగిపోయే భూములను మూడింతలుగా అధిక ధరలకు ప్రభుత్వంతో వైసిపి నాయకులు కొనిపించారని ఆరోపించారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక ప్రణాళిక, నిర్దిష్టమైన విజన్ లేకుండా గృహ నిర్మాణ పథకం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఫలితంగా లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో అందరికీ పక్కా ఇళ్ల పథకాన్ని చేపట్టిందని తెలిపారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టా ఇచ్చి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన పేదలకు అర్బన్‌లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సిఎం సహాయనిధితో ప్రాణాపాయస్థితిలో ఉన్న నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 21 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అంగన్వాడీ సహాయకులుగా నియమితులైన ఆరుగురికి నియామక పత్రాలను మంత్రి అందజేశారు. విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాను అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు ముంజేటి కృష్ణ ఆధ్వర్యాన మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. గతంలో భారత రాజ్యాంగంలో సమానత్వం సాధించాలన్ని తరగతుల ప్రజల అశాలకు తూట్లు పొడుస్తున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం ప్రైవేటు వ్యక్తి చేతిల్లోకి పెడుతుందన్నారు. దీనివల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ అందని ద్రాక్షగా మిలుగుతుందన్నారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ పిపిపి విధానంలో చేపట్టడం సరికాదన్నారు. వైద్య విద్యార్థులకు, పేద రోగులకు ఈ నిర్ణయం వల్ల తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అందుకు ప్రభుత్వమే మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలన్నారు. టెక్కలి సమన్వయకర్త పేడాడ తిలక్ మాట్లాడుతూ ప్రభుత్వమే బాధ్యత తీసుకొని మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ చేపడితే బోధనాస్పత్రుల్లో నాణ్యమైన వైద్య, విద్య మెరుగ్గా అందుతుందని అన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య బిసి సాధికారిత అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు బిసి సాధికారిత అధ్యక్షులు మామిడి శ్రీకాంత్, కళింగ బిసి సాధికారిత అధ్యక్షులు దుంపల లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు కె.భానుమూర్తి జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేసేందుకు నగరంలోని ఎన్‌జిఒ భవనంలో మంగళవారం సన్నాహక సమావేశాన్ని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలన్నారు. మెరుగైన పిఆర్‌సి, మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు సంబంధించిన దస్త్రం ఆర్థిక శాఖలో గత నాలుగేళ్లుగా మూలుగుతుందన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, ఇఎల్ ఎన్కాష్మెంట్, అంత్యక్రియల ఖర్చులు తదితర పెన్షన్ సౌలభ్యాలనూ చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందన్నారు. శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల మృతి చెందిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జెఎల్ ఉద్యోగోన్నతుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యారంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.రమణ, బి.వెంకటేశ్వర్లు, వి.సత్యనారాయణ, కుప్పిలి జగన్మోహన్, చావలి శ్రీనివాస్, వి.నవీన్‌కుమార్, వి.రామారావు, పి.హరిప్రసన్న, టి.శ్రీనివాసరావు, డి.రామ్మోహన్, డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఫ్యాప్టో సభ్యులు



డ్రోన్ నిఘాలో శ్రీకాకుళం నగరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్టు వేస్తూ, నగరంలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో నిరంతరం డ్రోన్ నిఘా కొనసాగుతుందని ఎస్‌పి కె.మహేశ్వర రెడ్డి అన్నారు. ఒకటి, రెండు, శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని శివారు బహిరంగా ప్రదేశాల్లో పేకాట, మద్యం, గంజాయి వినియోగం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు గ్రామీణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా మంగళవారం పెట్టామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వినియోగించిన వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిర్మాణష్యమైన ప్రదేశాలతో పాటు ఆయా పరిసరాల్లో పాడైన బంగ్లాలు, తోటలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు. బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి వినియోగి ంచిన, పేకాట, ఈవ్ టీజింగ్ తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారు పట్టుబడినట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో నిరంతరం డ్రోన్ నిఘా నీడలో ఉందని, నిర్మాణష్యమైన ప్రదేశాల్లో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని దళిత ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేయాలన్న కూటమి సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జెఎసి ఆధ్వర్యాన నగరంలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కితీసుకోని పక్షంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలు ఐక్యంగా పోరాటం సాగించాలన్నారు. అణగారిన, బహుజన తరగతులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఉద్యమాల పురిటిగడ్డ శ్రీకాకుళం నుంచే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాన్ని మొదలు పెడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటికరించేందుకు కూటమి సర్కార్ నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు.

సమావేశం నిర్వహణ బాధ్యతలను తైక్వాండో శ్రీను పర్యవేక్షించగా, అధ్యక్షునిగా డాక్టర్ కంఠవేణు వ్యవహరించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో అంతా పాల్గొని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై వారి అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమని మండిపడ్డారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తారని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రామ్‌గోపాల్, దళిత ఆదివాసీ నాయకులు వాబ యోగి, గ్లోబల్ స్కూల్ అధినేత ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఈ నెల 4,5 తేదీల్లో సోంపేటలో నిర్వహించనున్న సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు డి.గోవిందరావు తదితరులు పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు రంగాల శ్రీను, హైమావతి, రమేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కోర్టు భవనాల నిర్మాణాలకు కృషి

టెక్కలి: టెక్కలిలో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు కోరారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సీనియర్ న్యాయవాది దివ్వెల వివేకానంద మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు కార్యక్రమాల నిర్వహణకు సరిపోవడం లేదని అన్నారు. టెక్కలిలో ఉన్న కోర్టు పాత భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వివేకానంద తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకాన అజయ్ కుమార్, న్యాయవాదులు పొట్నూరు ఆనంద్, పి.సాయిరాజ్, వైకుంఠరావు, అద్దాల రాజేష్, రాజన్నాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

టెక్కలి : వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం టెక్కలి మండలంలో పర్యటించనున్నారని ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. అక్కవరం పంచాయతీ పరిధి శ్యాంసుందరాపురం కూడలి వద్ద రెవెన్యూశాఖ ఆధ్వర్యాన నిర్మించిన పెట్రోల్ బంక్ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. బన్నువాడలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి

నరసన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన స్వస్త్ నారి స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రధానమంత్రి మోడీ అక్టోబరు 17 నుంచి నవంబరు 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. మహిళా ఆరోగ్యమే కుటుంబా ఆరోగ్యమని అన్నారు. అనంతరం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, మెగా వైద్య శిబిరాన్ని, స్కానింగ్ సెంటర్ కంప్యూటర్ సిస్టమ్ రూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కళ్యాణ్, సూపరింటెండెంట్ శ్రీనుబాబు, డాక్టర్లు రోణంకి కృష్ణంనాయుడు, భైరి భాస్కరరావు, జి.చిట్టిబాబు పాల్గొన్నారు.

వైద్య సేవలు వినియోగించుకోవాలి

కవిటి: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని మాజీ సర్పంచులు ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు అన్నారు. 'స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా కవిటి సిహెచ్‌సిలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్య నిపుణులు సురేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ వైద్య శిబిరాలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన రోగులకు ఉచితంగా పులిహోరా పొట్లాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, డాక్టర్ వాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి : మందులు అందిస్తున్న నాయకులు

దసరాకు తరలిపోతున్న మద్యం

ప్రజాశక్తి- టెక్కలి

అక్టోబరు 2న గాంధీ జయంతి, దసరా కావడంతో మద్యం, మాంసం ప్రియుల నోటికి తాళం వేయాల్సిందేనా? గాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంస విక్రయాలకు డ్రై డే కావడం, అదే రోజుజు దసరా పర్వదినం కావడంతో వ్యాపారులు ముందస్తు మార్గాలను వెతుక్కుంటున్నారు. దసరా అంటేనే మాంసం, మద్యం, ప్రధాన వంటకాలు పండగ. గాంధీ జయంతి రోజు కావడంతో కీలకమైన రెండు వస్తువులు అమ్మకాలు బహిరంగంగా సాగవు. కనుక పట్టణంలో మాంస దుకానాలు తెరిచేందుకు ఇప్పటికే యజమానులు నిర్ణయించుకున్నారు. అయితే మద్యం అమ్మకాలపై మాత్రం నిషేధం ఉండడంతో పట్టణంలోని మద్యం దుకాణాదారులు మద్యాన్ని చీకటి గదుల్లోకి తరలించేస్తున్నారు. పట్టణంలోని 8 మద్యం దుకాణాల ద్వారా రోజుకు రూ.పది నుంచి రూ.15 లక్షల వరకు అమ్మకాలు సాగుతున్నాయి. అలాగే బెల్టుషాపులు యథేచ్ఛగా సాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. దసరాను పురస్కరించుకుని మద్యాన్ని బెల్టు దుకాణాలకు తరలించి అదిక ధరలకు అమ్ముకోవాలని వ్యాపారులు భావిస్తున్నారు. పట్టణంలోని మద్యం దుకాణారులంతా సిండికేట్ వ్యాపారులు కావడంతో ఇప్పటికే గ్రామాలను పంచుకున్నారు. వారి కనుసన్నల్లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలకు ఇప్పటికే మద్యం తరలించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు దుకాణాలు నిర్వహణ నిషేధం అయినా... మండలంలోని పలు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. బెల్టు దుకాణాల ద్వారా అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగుతున్నా... దసరా సందర్భంగా మరింతగా అధిక ధరలకు మద్యం విక్రయించేందుకు వ్యాపారులు నిర్ణయం తీసుకున్నారు. ఏదేమైనా దసరా సందర్భంగా మద్యం అమ్మకాలు జోరందుకోనుండడంతో బెల్టు దుకాణాలు మద్యం సీసాలతో కళకళలాడనున్నాయి.

రేపు మాంసాహార విక్రయాలు నిషేధం

మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని చికెన్, మటన్, చేపల అమ్మకందారులు, హోటళ్లు, రెస్టారెంట్లలో అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా మాంసాహార విక్రయాలు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరూ జంతు వధ చేయకూడదని మాంసాహారాన్ని అమ్మకూడదని పురపాలక సంఘం కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆ ప్రకటనలో స్పష్టం

నగదు అందుకుంటున్న విజేతలు

జిల్లాస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- వజ్రకొత్తూరు

మండలంలోని అమలపాడులో సరస్వతీ పూజా మహోత్సవం సందర్భంగా సాయికిరణ్ ఫ్రెండ్స్ అసోషియేషన్ (దాసరివానిపేట) ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల నృత్య పోటీల్లో ఎన్‌డిఎస్ శ్రీకాకుళం రూ.25 వేలు నగదు, షీల్డుతో ప్రథమ స్థానం కైవశం చేసుకుంది. ద్వితీయ స్థానంలో రూ.15 వేలు నగదు, షీల్డును జూనియర్ ఆలీ డోకులపాడు, తృతీయ స్థానంలో రూ.10 వేలు నగదు, షీల్డును లిటిల్ స్టార్స్ ఇచ్ఛాపురం కైవశం చేసుకున్నట్లు నిర్వహకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 25 గ్రూపులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు సాయికిరణ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ దున్న షణ్ముఖరావు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రగతి దిశగా ఎమ్మెల్సీ ప్రసంగం

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు నర్తు రామారావు మండలిలో అద్భుత ప్రసంగం నియోజకవర్గాన్ని ప్రగతి దిశగా అడుగులు పడడానికి దోహదపడుతుందని వైసిపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌లోని ఎంపిపి ఛాంబర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలి వేదికగా పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణ, కంచిలి మండలంలో సాగరాల నీటి నిల్వ సామర్థ్యం పెంపు, మరమ్మతులు, బాహుదా పరీవాహక ప్రాంతంలో కాలువల్లో నీటి సరఫరాకు అనువుగా మల్చడం వంటి అవసరాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. కడలి పాలవుతున్న వంశధార నది మిగులు జలాలు ఇచ్ఛాపురం వరకు తీసుకురావాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో బెంతుఒరియాలను మోసగించి, వారి ఓట్లతో పదవులు దక్కించుకొని, వారి సామాజిక స్థితి అస్తిత్వాన్ని సందిగ్ధంలో పడవేసిన వైనాన్ని ప్రశ్నించారని అన్నారు. కార్యక్రమంలో ఆశి పురుషోత్తంరెడ్డి, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరాంలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ఫిర్యాదు

పలాస : వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపిపై ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు ఆధ్వర్యాన టిడిపి నాయకులు కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ పరిధిలోని వైసిపి నాయకుడు సామజిక మీడియాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అవహేళన చేస్తూ, అసత్యాలను అసభ్యకర రీతిలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో ప్రభుత్వం పేద ప్రజల జీవన విధానానికి అనుకూలంగా ఉండేలా విద్యుత్ టారిఫ్‌లను తగ్గించే ప్రయత్నం చేందని అన్నారు. ఈ సమయంలో గోపి ప్రజలకు అసత్య ఆరోపణలను, కల్పిత వార్తలను ప్రభుత్వానికి వ్యతిరేఖంగా సుమారు 20 గ్రూప్‌ల్లో ప్రచారం చేశారని అన్నారు. ప్రజల్లో అసమానతలను కలగజేస్తూ, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా, అసభ్యకరమైన పదజాలంతో వ్యాఖ్యలు చేస్తూ... అశాంతి వాతావరణానికి ప్రేరేపించే విధంగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పలాస ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే నడపాలి

టెక్కలి: రాష్ట్రంలో వైద్య, విద్యారంగాలను ప్రభుత్వమే నడపాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు కోరారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రైవేట్ వ్యక్తుల చేతిలో వైద్య రంగాన్ని అప్పజెప్పడం సబబు కాదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మహిళా రిజర్వేషన్లు కొల్లగొట్టేందుకు కారు చౌకగా అమ్మడం వైద్యరంగాన్ని దోపిడీ చేయడానికేనని అన్నారు. వేలాది ఎకరాల భూములను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పిపిపి పద్ధతిని ప్రవేశపెట్టిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్య రంగాన్ని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించవచ్చునని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, రాకోటి రాంబాబు, కొచ్చెర్ల కాళిదాస్, రమేష్ పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న సభ్యులు

భగవద్గీత పోటీల విజేత వెంకటహరిణి

కవిటి: దేవీ నవరాత్రుల సందర్భంగా కవిటి కనకదుర్గ ఆలయం వద్ద సోమవారం రాత్రి నిర్వహించిన భగవద్గీత పోటీల్లో బొరివంకకు చెందిన బి.వెంకటహరిణి విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో పలాసకు చెందిన కె.నిధి ద్వితీయ స్థానంలో నిలవగా, కవిటికి చెందిన ఎ.తేజేశ్వరి తృతీయ స్థానం కైవసం చేసుకుంది. పోటీలో పాల్గొన్న బి.నారాయణ, వి.వినయ్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల మైసూరులో దత్త పీఠం ఆధ్వర్యాన నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్త పోటీల్లో బంగారు పతకం గెలుచుకున్న కంచిలి మండలం గొల్లపుట్టుగకు చెందిన మురపాల జగన్నాథరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఉమామహేశ్వరరావు, తారకేశ్వర ఆచారి, బెందాళం భాస్కరరావు, మొగిలిపురి సీతారాం, బిపి రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

శక్తి యాప్ రక్షణ కవచం

నరసన్నపేట: సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని ఉర్లాంలో నారీ శక్తి యాప్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రకాల నేరాలు, వాటిని నియంత్రించే చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు నారీ శక్తి యాప్ స్త్రీలకు రక్షణ కవచం లాంటిదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

సంక్షిప్త వార్తలు

పిఎసిఎస్ ఆస్తుల పరిరక్షణకు కృషి

పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

పొందూరు: పిఎసిఎస్ ఆస్తుల పరిరక్షణ బాధ్యత తనదేనని పొందూరు పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళి అన్నారు. పొందూరు మండల పరిధిలోని జోగన్నపేట వద్దగల పిఎసిఎస్ స్థలం వద్ద మంగళవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ స్థలంలో రూ.60 లక్షలతో పిఎసిఎస్ కార్యాలయంను నిర్మించేందుకు ప్రతిపాదన పంపించామని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే రెండు నెలల్లో భవనం నిర్మాణాలను పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే మండలంలోని లోలుగు, నందివాడ, పిల్లలవలస, తండ్యాం, కనిమెట్ట గ్రామాల్లోని పిఎసిఎస్ స్థలాలకు ప్రహరీల నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఈయనతోపాటు టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ సబ్ డివిజనల్ అధికారి పూజారి జానకిరావు, జిల్లా ఆడిటర్ ఎం.శ్రీనివాస్, పిఎసిఎస్ సభ్యులు దుంపల సత్యం, కింజరాపు వెంకటరమణ, ఇన్‌ఛార్జి సిఇఒ ఇలపండ వెంకటరావు, కామేశ్వరరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కవిటి విద్యార్థుల ప్రతిభ

పతకాలతో శృతి, శిరీష

కవిటి: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సెప్టెంబరు 26,27,28 తేదీల్లో నిర్వహించిన 38వ జూని యర్ అథ్లెటిక్స్ పోటీల్లో కవిటి విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయి 5కెఎం నడక పోటీల్లో కవిటి జూనియర్ కళాశాల విద్యార్థి మొగిలిపురి శృతి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ పోటీలో ఎస్‌సిజె విద్యార్థి కె.శిరీష బ్రాంజ్ మోడల్ కైవసం చేసికుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉషోదయ యువజన సంఘం, ఆయా కళాశాలల యాజమాన్యం, సిబ్బంది విజేతలకు అభినందనలు తెలియజేశారు.

రేపట్నుంచి 'కార్యకర్తలతో కృష్ణచైతన్య'

నరసన్నపేట: వైసిపి నాయకులు కృష్ణచైతన్య కార్యకర్తలతో మమేకమవుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 2న నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి ఆరంగి మురళీధర్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థాయి నాయకులు, యువజన, రైతు, మహిళ, బిసి, ఎస్‌సి సోషల్ మీడియా కమిటీల సభ్యులతో కలిసి కష్టసుఖాలు పంచుకుంటూ.. సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను చర్చించనున్నారని అన్నారు. ఈ వినూత్న కార్యక్రమం 70 క్లస్టర్లలో 36 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఎంపిపిలు వాన గోపి, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, డిఎల్‌డిఎ చైర్మన్ నక్క తులసీదాస్, పొందర విభాగం అధ్యక్షులు అప్పన్న , జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.సిహెచ్‌గుప్తా, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు జి.వెంకట రమణి పాల్గొన్నారు.

సొంత డబ్బులతో వీధి దీపాలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న శేఖర్

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డుల్లో బెల్లుపడా కాలనీలో విద్యుత్ దీపాలు లేక ప్రజలు పడుతున్న బాధలు గమనించిన వార్డు టిడిపి నాయకులు, పట్టణ కార్యదర్శి శాసన శేఖర్ తన సొంత డబ్బులు వెచ్చించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడం మున్సిపల్ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోయారు. దీంతో అంధకారంలో ఉండడం, కుక్కలు బెడద, విష సర్పాలతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న శేఖర్ నడుం కట్టి ఐదు విద్యుత్ స్తంభాలపై కొత్త బల్బులు వేయించారు. పాడైన లైట్లను బాగు చేయించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన శేఖర్‌ను స్థానికులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు మెట్ట మోహనరావుకు గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈయన విశాఖపట్నం జిల్లాలోని గోపాలపట్నం మండలంలోని లక్ష్మీనగర్ ఎంపిపి స్కూల్‌లో పనిచేస్తున్నారు. దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ బూర్ల లలిత కుమారి, మాజీ ఉప సర్పంచ్ బిల్లంగి ఢిల్లేశ్వరరావు, బూర్ల శ్రీనివాసరావు, బిజెపి మండల నాయకులు వంజంగి రమేష్, మడపాల తిరుపతిరావు, శశిభూషణరావు, తేజేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ఆమదాలవలస : మండలంలోని చిట్టివలసలో దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి పూజ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1500 మంది ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక ఫకీరుపేటలో దుర్గా నవరాత్రుల సందర్భంగా వైద్యులు ఉలాల కోదండరాం, జ్యోతి దంపతుల సౌజన్యంతో రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. కోదండరాం రూ.51 విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కోదండరామ్ కుమారుడు కీర్తివర్ధన్, కుమార్తె గేష్ణవర్షిణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

ఆమదాలవలస: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులుగా విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గ ప్రభుత్వ వైద్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సరుబుజ్జిలి, పురుషోత్తపురం, బూర్జ, గుత్తావల్లి, అక్కులపేట, తొగరాం, దూసి, పట్టణంలోని పలు అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు శ్రీకాకుళంలో ఉన్న ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లారు. సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నత చదువులు చదువుకొని భవిష్యత్‌లో స్థిరపడాలన్న తమ ఆలోచనకు ప్రభుత్వం విధించిన నిబంధనలు కొంతమేర ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వం వైద్యం అన్ని రకాల అందేవిధంగా కృషి చేస్తున్నామని వివరించారు. తమ సమస్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

నవదుర్గ అవతారంలో నాట్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శనలు అందరినీ అలరించాయి. అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన సాంప్రదాయ కూచిపూడి నాట్య ప్రదర్శనలు స్వేచ్ఛ నృత్య తరంగిణి నాట్య కళాకారులతో నాట్య ప్రదర్శనలు చేశారు. నాట్య కళాకారులు, నాట్య గురువు మంగి దివ్య, కె.కుమార్, డి.శిరీషపట్నాయక్. బి.భవానీ, పి.వర్షిత, టి.ఉషారాణి మొత్తం 26 మంది నాట్య కళాకారులు ప్రదర్శనలో పాల్గొని అద్భుతమైన సాంప్రదాయ కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రదర్శించారు. నవదుర్గ పాటకు 9 మంది నాట్య కళాకారులు, నవదుర్గ అవతారంలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ప్రజలను మైమరిపించారు. ఈ పాటకు కమిటీ సభ్యులు, ప్రజలు ప్రశంసలు జల్లు కురిపించారు. నాట్య కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలకు అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ, నాట్య గురువు మంగి దివ్యకు ప్రత్యేకంగా సత్కరించారు. అకాడమీ అధ్యక్షులు కె.గోవిందరావు, మంగి దాలమ్మ నాట్య కళాకారులకు అభినందించారు. నాట్య ప్రదర్శన తిలకించేందుకు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్స్ హబ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన నియోజకవర్గ స్థాయి విద్యార్థులకు అందుబాటులో ఈ కోర్సు ఉంటుందని తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో కూడా మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. పదో తరగతి చదివి ఉత్తీర్ణులైన వారు అర్హులని, నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 8లోగా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రైమ్ కార్నర్

జి.సిగడాం : యశ్వంత్‌కుమార్ మృతదేహం (ఇన్‌సెట్‌లో యశ్వంత్‌కుమార్)

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలోని మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ వద్ద, జి.సిగడాం మండలంలోని ఆనందపురం అగ్రహారం గ్రామాల్లో మంగళవారం సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

జి.సిగడాం/పొందూరు : మండలంలోని ఆనందపురం అగ్రహారం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ద్విచక్ర వాహనం, లగేజీ వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో కొంచాడ యశ్వంత్ కుమార్ (15) అక్కడికక్కడే ప్రాణం విడిచిపెట్టారు. బైక్‌పై యశ్వంత్ కుమార్, కృష్ణాపురానికి చెందిన చెందిన కెల్ల వెంకటేష్ (19) ద్విచక్రపై రాజాం వెళ్తున్నారు. రాజాం వెళ్లే మార్గంమధ్యలో ఆనందపురం సమీపంలో బైక్, లగేజీ వ్యాన్ ఎదుదెదురుగా ఒక్కసారిగా ఢీ కొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో యశ్వంత్ కుమార్ తలకు బలంగా గాయాలు తగలడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. అలాగే బైక్ వెనుక కూర్చున్న వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మృతుడు తల్లిదండ్రులు రాజు, కుమార్‌రాజ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తునానరు. యశ్వంత్‌కుమార్‌ను రాజాంలో ఒక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివిస్తున్నారు. వేరే పని నిమిత్తంగా యశ్వంత్ కుమార్ రాజాం వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుసూదనరావు, ఎఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లయ్యగారిపేటలో విషాదం

జి.సిగడాం మండలం ఆనందపుర అగ్రహారం సమీపంలో సంభవించిన రహదారి ప్రమాదంలో పొందూరు మండలం రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేటకు చెందిన కొంచాడ యశ్వంత్ కుమార్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో సరదాగా, సందడిగా, చలాకీగా తిరుగుతూ ఉండే యశ్వంత్ మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులతో పాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

లక్ష్మణరావు మృతదేహం (ఇన్‌సెట్‌లో లక్ష్మణరావు)

మెళియాపుట్టి : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో చాపరకు చెందిన నాగవంశం లక్ష్మణరావు (39) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామం నుంచి మెళియాపుట్టి నడిచి వెళ్తుండగా... పలాస నుంచి పర్లాకిమిడి వైపు వెళుతున్న ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొంది. రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలంలోనే మృతి చెందారు. మృతునికి భార్య కల్పన, ముగ్గురు పిల్లలు వరుణ్, కౌశిక్, దీపక్ ఉన్నారు. కుటుంబానికి పోషించే యజమాని కోల్పోవడంతో కుటుంబీకులు బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. దీంతో చాపరలో విషాద ఛాయలు అమలుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంతబొమ్మాళి : మండలంలోని లక్కివలస పంచాయతీ పిట్టవానిపేట సముద్ర తీరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైనట్టు సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం తెలిపారు. మొఖం, శరీర భాగలపై సముద్రంలో చేపలు దాడిచేసినట్లు ఉందని, మృతదేహాన్ని కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

సోంపేట : ఇద్దరు చైన్ స్నాచర్లను మంగళవారం అరెస్టు చేశామని బారువ సిఐ బంగరాజు, ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు సోంపేట సిఐ కార్యాలయంలో నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటి మండలం దోగానపుట్టుకకు చెందిన ఎంపల కృష్ణ తన భార్య జానకితో కలిసి మందసలోని తన అల్లుడు ఇంటికి సెప్టెంబరు 14న ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారని అన్నారు. సోంపేట మండలం పాలవలస వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సదరు కృష్ణ ద్విచక్ర వాహనాన్ని బైక్‌పై వెళున్న ఇద్దరు ఆపారని తెలిపారు. శ్రీకాకుళం గ్రామానికి వెళ్లడానికి అడ్రస్ అడిగారని అన్నారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న వ్యక్తి కృష్ణ భార్య జానకి మెలో ఉన్న బంగారు ఆభరణాలను తెంచుకుని పారిపోయారని అన్నారు. జానకి ఫిర్యాదు మేరకు సిఐ మంగరాజు కేసు దర్యాప్తు చేపట్టారని తెలిపారు. వ్యక్తులు, సిసి కెమెరా ఆధారంగా మండలంలోని కొర్లాం గ్రామంలో నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన సిఐ మంగరాజు